సీరియల్

# సహగమనం




## మధురాంతకం నరేంద్ర

(గత సంచిక తరువాయి)

### 3

"సార్, కళ్ళజోడు..." వెనకే పరిగెత్తుకొచ్చాడు అటెండరు.

మెట్లు దిగుతున్నవాడు అలాగే ఆగిపోయి, అసంకల్పితంగా జేబులు తడుముకుని, "మరచిపోయాను, థాంక్యూ !" అంటూ కళ్ళజోడునందుకున్నాడు రాజేష్.

మోటార్‌బైక్ దగ్గరికి నడిచాక, కీ చైనుకోసం మళ్ళీ వొకసారి జేబులు తడుముకున్నాడు.

విసుగ్గా నిట్టూర్చి, వెనక్కు నడిచాడు.

మెట్లెక్కి, తన గదిలోకి వెళ్ళి తెచ్చుకునే వోపిక లేకపోవడంతో, "ఇదిగో, రమణా !" అంటూ బిగ్గరగా కేకేశాడు.

"సార్ !" అటెండరు వరండాలోకొచ్చి కిందికి తొంగిచూశాడు.

"నా టేబుల్‌పైన కీ చెయినుండాలి. కాస్త తెచ్చిపెట్టు..."

అటెండరు కీ చైను తీసుకొచ్చి ఇచ్చాడు.

"థాంక్యూ !" కీ తిప్పి కిక్కర్‌ను తొక్కాడు. ఇంజన్ స్టార్టుకాలేదు. విసుక్కుంటూ మళ్ళీ ప్రయత్నించాడు. ఇంజన్ చెప్పినమాట వినడంలేదు. ఆయిల్ ఫ్లో సవరించిన తరువాత, విసుగ్గా కిక్కర్‌ను వెనక్కు నెట్టాడు. ఇక తప్పదన్నట్టుగా ఇంజన్ స్టార్టయింది.

రాజేష్ వెనక్కు తిరిగి చూశాడు.

అటెండరు నవ్వుకుంటూ తనవంకే చూస్తున్నాడు.

బలవంతంగా తానూ ఒక నవ్వును కొని తెచ్చుకొని మోటర్‌బైక్‌ను పరిగెత్తించాడు.

యెండ బాగా తగ్గిపోయింది.

షికార్లకూ, షాపింగ్‌లకూ తిరిగే జనంతో రోడ్లు హడావుడి పడుతున్నాయి.

బస్‌స్టాప్‌ల దగ్గర జనం గుమికూడి పోతున్నారు.

శ్రీనగర్ క్రాస్ దగ్గరికి రాగానే, ఫర్లాంగుపొడవునా ఆగిపోయిన వాహనాలు వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి.

"ట్రాఫిక్ జామ్..." ప్రక్కనే ఆగిన ఆటోలోంచీ డ్రైవరు మాటలు వినిపించాయి.

జేబులోంచీ రుమాలు పైకిలాగి, నుదుటిపైని చెమటను తుడుచుకున్నాడు రాజేష్.

ఎదురుగాలి తాకిడి చల్లగానే అనిపిస్తున్నా వొళ్ళంతా చీదరగా తయారవడంతో విసుగ్గావుంది అతడికి.

'ఇంటికెళ్ళి స్నానంచేస్తేగానీ కుదరదు' అనుకున్నాడు.

'విసుగ్గా వున్నప్పుడు పరీక్షించడానికన్నట్టుగా అన్నిచోట్లా ఆలస్యమే జరుగుతోంది. నాలుగురోజులక్రితమనగా ప్రారంభమైన డ్యాంసైటు సర్వే ఇప్పటికి గానీ పూర్తికాలేదు. స్నానం ముగిశాక, బట్టలు మార్చుకుని నర్సింగ్ హోమ్‌కు వెళ్లాలి. సాగర్ యెలావున్నాడో యేమిటో ? మానస ఆరోగ్యం యెలా వుందో ? దగ్గరుండి సహాయపడవలసిన సమయంలోనే క్యాంపులూ, సర్వేలూ... పని ఒకచోట, ధ్యాస మరియొక చోట ... నచ్చినపని చేయడానికి కోటి అడ్డంకులు... వీలు దొరికినప్పుడల్లా మనిషికి అతడి అల్పత్వాన్నీ అసమర్థతనూ గుర్తుచేయాలని పట్టుబట్టుకుని కూర్చుందీ ప్రపంచం...'

వెనకనుంచీ హారన్ గొంతుచించుకొంటోంది.

వాహనాలు మెల్లగా కదులుతున్నాయి.

ఇంకా పూర్తిగా పరిగెత్తే అవకాశం దొరకలేదు. చీమదూరే సందు దొరికినా ఆక్రమించుకోవడం కోసం ప్రతి వ్యక్తీ పరుగులు తీస్తున్నాడు. ప్రవాహంలోకి దిగిన తరువాత తన అస్తిత్వానికి విలువలేదు. ఇష్టంలేకున్నా ముందుకు కొట్టుకు పోవలసిందే !

తానూ ముందుకు కదిలాడు.

పెళ్ళి వూరేగింపులా ట్రాఫిక్ మెల్లగా సాగుతోంది.

రోడ్డు క్రాస్‌చేయలేకపోయిన బాటసారులంతా యెటువైపున్నవాళ్ళు అటువైపునే ఆగిపోయి, బిక్క మొహాలేసుకుని చూస్తున్నారు.

కూడలి దగ్గర 'స్టాప్' బోర్డు తగిలించుకున్న కానిస్టేబుల్ శ్రీకృష్ణ పరమాత్ముడిలా అభయముద్రతో 'చూశారా, నా ప్రతాప'మన్నట్టుగా ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు.

అతడ్ని దాటుకున్నాక కట్టలు తెంచుకున్న ప్రవాహంలా ట్రాఫిక్ వురకలువేసింది.

రాజేష్ మరో అయిదు నిముషాలో తన గదిని చేరుకున్నాడు.

మోటార్‌బైక్ స్టాండువేసి, కీ వేశాడు. గది తలుపులముందు కాస్సేపు బిగంతో కుస్తీపట్టి, లోపలికి ప్రవేశించాడు.

తివాచీపైన వుత్తరం కినిపించింది.

తీసుకుని టేబులుపైకి గిరవాటు పెట్టాడు.

గది అడ్రసుకు సామాన్యంగా యెవరూ జాబులు రాయరు. యెన్ని సార్లు చెప్పినా, గది అడ్రసుకే వుత్తరాలు రాసే యేకైక వ్యక్తి యెవరో అతడికి బాగా తెలుసు.

నాలుగయిదు రోజులుగా గదిలో జనం నడయాడక పోవడంతో అది 'బ్రహ్మచారి కొంప' అని స్పష్టంగా తెలియజేయడంకోసం కళాదర్శకుడు నిర్మించిన సెట్టింగులా వుంది.

మంచంపైన మాసిన బట్టలు ... హేంగర్లకు వ్రేలాడుతున్న ప్యాంట్లూ ... టేబుల్‌పైన పుస్తకాల దొంతరలూ ... నేలపైన దుమ్మూ, సిగరెట్టు పీకలూ ... షర్టు తీసేశాక, చుట్టూ వోసారి తిరిగి చూసి, బాగు చేయడం కంటే పాడుచేయడమే సులభమైన పనిగా గుర్తించినట్లు, దాన్నిగూడా మంచంపైకి విసిరేశాడు రాజేష్.

లుంగీ కట్టుకుని, ఫాన్ ఆన్‌చేసి. యీజీఛేర్లో కూచున్నాడు.


టేబుల్‌పైన వుత్తరం రెపరెపలాడింది.

చేతికందుకున్నాడు.

కవరు చింపి, వుత్తరం పొరలు విప్పాడు.

'యీసారి వుపోద్ఘాతాల్ని వదలిపెట్టి, యేకంగా పెళ్ళిసంబంధాల జాబితాను తయారుచేసేశారు. వరసగా అరడజను సంబంధాలు ... చదువు, తండ్రి ఆర్థిక స్థోమతా, యివ్వగలిగిన కట్నమూ – వరసగా గీతలుకొట్టి పట్టిక నొకదాన్ని తయారుచేసి పంపితే సరిపోయేది గదా !' రాజేష్ తనలో తానే నవ్వుకున్నాడు. రిటైరై యింట్లో కూచున్న తనకు యీ చివరి బాధ్యత నుంచీ విముక్తిని కలిగించమనీ, అమ్మ బెంగపెట్టుకుందనీ, అన్నయ్యా వదినా కోపగించుకుంటున్నారనీ నిష్ఠూరం చేస్తూ ముగించాడు ఆయన. తండ్రిపైన కోపమూ, సానుభూతీ రెండూ వొకేసారి కలిగాయి అతడికి.

'తనకు పెళ్ళిచేసుకోవలసిన వయసొచ్చి నెత్తిమీద కూచుందన్న విషయమూ తెలుసు. తాను పెండ్లాడదలచుకుంటే టెండర్లు పంపుకోవడానికి సిద్ధంగా వున్న తల్లిదండ్రులు దండిగానే వున్నారన్న సంగతీ తెలుసు. కానీ పెళ్ళిచేసుకోవాలంటే యివేమీ ముఖ్యంకాదని ఆయనకెలా చెప్పాలి ? మొదటిసారి చూసినప్పుడు, కనీసం క్షణంసేపయినా హృదయాన్ని స్పందింపజేయని అమ్మాయిని జీవితంలోకి యెలా ఆహ్వానించడం ? అమ్మాయికేం ? లక్షణంగా వుంది – అంటాడు నాన్న. చిదిమి దీపం పెట్టుకోవచ్చు – అంటుంది అమ్మ. అందంగా లేదన్నానా నేను ? – ప్రశ్నించేవాడు తాను – మరింకేమిటి నీ గొడవ ? యెలా చెప్పాలి తాను ? 'అరయన్ వంశము నిలపనేగద వివాహంబు ?' యెవడన్నాడా మాట ? వంశమన్న ప్రవాహంలో వ్యక్తులు కొట్టుకు పోవలసిందేనా ? జీవితాన్ని వీలయినంత సుఖవంతంగా మలచుకోవడం కోసమే తోడు కావాలి. కేవలం శారీరక వాంఛల్ని తీర్చుకోవడం కోసమయితే పెళ్ళెందుకు ? యేదీ. నిజంగా , నా



జీవితాన్ని నందనవనంగా మార్చే తోటమాలి ? వాక చిరునవ్వుతో బడలికనంతా తుడిచిపారేసే మాధుర్యమూర్తి ! ... వాళ్ళంతా నగలు దిగేసుకుని, పట్టు చీరలో వుడికిపోతూ, వైవాహిక జీవితమనే వుద్యోగానికి యేర్పాటు చేసిన యింటర్వ్యూలో నెగ్గుతానో లేదోనని కంగారుపడుతూ, బెదురు చూపులు చూసే యీ అమాయకపు ప్రాణులు నాకొద్దు. నాక్కావల్సిన వ్యక్తి యెవరో మీకెలా చెప్పాలి ?'

బాత్రూంలోనికి వెళ్ళి గబగబా నీళ్ళు నెత్తిపైన దిమ్మరించుకున్నాడు.

'తన పెళ్ళి చేశాక బాధ్యతలు తీరిపోతాయని నాన్న ఆశ. బాగానే వుంది. తరువాత జీవితమంతా యెవరిది ? తనది. మంచి జరిగినా, చెడు జరిగినా అనుభవించవలసింది యెవరు ? తానే ... పాపం ! మానస ... ఆవిడ కోరిక ప్రకారం యెమ్మేలో చేర్చినా బావుండేది! యిప్పుడేమయింది ? కొలాప్స్ ...సర్వ నాశనం ... యిక ఆమె జీవితంలో యేం మిగిలింది ? నథింగ్ ... యింతకంటే తుపాకీతో వొక్కసారిగా కాల్చిపారేసినా బావుండేది. అయ్యో మానసా ? భర్త అన్న పదానికి అర్థమయినా పూర్తిగా అవగతం కాలేదే నీకు ? భార్యగా నీ వెత్తిన అవతారం ఆరు నెలలయినా కొనసాగలేదే ? మారేజ్ యీజ్ ది గోల్ ఫార్ వుమెన్, యిటీజ్ యే సింపుల్ ఛేంజ్ యిన్ ది లైఫ్ అఫ్ యే మాన్ ... నాన్సెన్స్ ... యెందుకింత పలపక్షం ? యేమిటి ఆడవాళ్ళు చేసిన నేరం ? శారీరకంగా కూడా యెదగనివ్వకుండా జాగ్రత్త పడుతూ, తనకొక న్యాయాన్నీ, ఆమెకొక న్యాయాన్ని సృష్టించి, అమానుషంగా ప్రవర్తిస్తుంటే చూస్తూ వూరుకోవలసిందేనా ? నో, యీ అవినీతి యిలాగే చెలామణి కావడం నేరం. లే మానసా, యీ గతజల సేతుబంధనాల్ని వొదిలించుకుని పైకిలే ... అందరి కళ్ళు కుట్టేలా, అందరూ తల వంచుకునేలా కసిగా మళ్ళీ పెళ్ళాడు ... అవును మళ్ళీ పెళ్ళాడు. పెళ్ళాడు మానసా పెళ్ళాడు. నీకేం తక్కువ ? చిదిమి దీపం పెట్టుకోవచ్చు. యెంతటి అపురూపమయిన సంస్కారం నీ సొత్తు !

ఆరునెలల క్రితం వరకూ, నిన్ను పెళ్ళాడగలిగినవాడు చాలా అదృష్టవంతుడని అనుకొందిగదా ప్రపంచం...యింతలో, యీ చిన్న యెపిసోడ్ అడ్డం వచ్చినంత మాత్రాన ఆ విలువ మారిపోతుందా ? అదే అందం ... అదే సంస్కారం...అదే వ్యక్తివి నువ్వు... నేడు సైతము నిన్ను పెళ్ళాడిన వాడు అదృష్టవంతుడు గాక పోతాడా ? నో... ముమ్మాటికీ అతడు లక్కీ ఫెలోనే ! నువ్వు 'వూ' అనాలేగాని, యెవరయినా నిన్ను కళ్ళ కద్దుకుని చేసుకుంటారు. యెవరిదాకానో యెందుకు ? నేను..."

మంచినీళ్ళలో విద్యుత్తు ప్రవహించినట్టయింది.

భూకంపం వచ్చి, సరిగ్గా తన పాదాలకింద భూమి పగిలి పోయి, తానెక్కడో అగాధంలోకి జారిపోతున్నట్టుగా తోచింది.

ముఖానికి పట్టించిన సోపు నురగ చివాలున తెరచుకున్న కనురెప్పల సందుల్లోంచీ లోపలికి దూరి, కళ్ళను భగభగ మండించింది.

రాజేష్ కళ్ళు మూసుకున్నాడు.

రెండు మూడు నిమిషాలసేపు అచేతనుడై నిలుచుండి పోయాడు.

అతడి మనసు ఆలోచించడం మానేసింది.

యెద రొమ్ముపైన గుండె లోలకంలా టక్కు టక్కు మని కొట్టుకొంటోంది.

కళ్ళు మండుతున్నాయి.

షవర్ తిప్పాడు.

తల దిమ్మ తిరిగేలా నీళ్ళు దుమకసాగాయి.

'తన కెందుకొచ్చిందీ ఆలోచన ? నాన్న కోపంతో యెగిరి గంతులేయడూ యీ సంగతి తెలిస్తే ! అమ్మ, అన్నయ్య, వదిన, బంధువులు, స్నేహితులు, యీ ప్రపంచం - యేమనుకుంటారు తనను జూసి ? అమ్మ యేడుస్తుంది. అన్నయ్య మండిపడతాడు. కొందరు బంధువులు బాధ పడతారు. కొందరు జాలిపడతారు. యింకొందరు తమ కసి తీరింది లెమ్మనుకుంటారు. స్నేహితులు యెగతాళి చేయరూ యిది విని ? లోకంలో తలెత్తుకుని తిరగలడా తాను ? అందమయినదే కావచ్చు... సంస్కారవంతురాలు అయివుండవచ్చు. అయినా వితంతువుని... యెందుకీ యెదురీత ? అందమయిన జీవితాన్ని యెడతెగని పరీక్షగా యెందుకు మార్చుకోవాలి ? తన కెందుకొచ్చిన బాధ ? తనకు మాత్రం యేం పట్టింది ? అందరూ చేతులు ముడుచుకుని కూర్చున్నప్పుడు, యిదిగో 'నేనున్నానండి సంస్కర్తని-' అంటూ డబ్బా వాయించుకుని, అపురూపమైన జీవితాన్ని అంతులేని శోధనగా యెందుకు మార్చుకోవాలి ? నో... తన తరంగాదు. తనకేం కొదువ ? లక్షల కట్నం, కోరుకున్న అందం అన్నీ సిద్ధంగా యెదురు చూస్తున్నాయి. తన సమాధానం కోసం...అన్నిటినీ వదలిపెట్టి ముళ్ళ దారిలో యెందుకు ప్రయాణం ? కావలిస్తే యింకెవర్నయినా పెళ్ళాడమను. తానూ వెళ్ళి అభినందించి వస్తాడు. అంతేగానీ, తనకు మాలిన ధర్మం యెందుకు ? అసలింతకూ యిలాంటి వూహ తనకెందుకు రావాలి ?'

టవలుతో తల తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు.

స్విచ్ నొక్కగానే, టేబుల్ ఫాను విజృంభించింది.

సిగరెట్ వెలిగించుకున్నాడు.

హాయిగా వుంది.

యేదో పెద్ద ప్రమాదం నుంచీ బయట పడినట్టు అనిపిస్తోంది.

భయంకరమయిన కలగని, వులిక్కిపడి మేలుకుని అంతా కేవలం కల మాత్రమేనని గుర్తించిన తరువాత, 'అమ్మయ్య' అనుకొని వూపిరి పీల్చుకున్నట్టు- చాలా ఆనందంగా వుంది.

గదిలో చీకటి ముసురుకుంటోంది.

వీధి దీపాలు వెలిగినట్టున్నాయి.

కిటికీలోంచి వెలుతురు టేబుల్‌పైకొచ్చి వాలుతోంది.

తెల్లటి వెండికప్పుపై పడిన వెలుతురు కిరణం నక్షత్రంగా చిట్లి, ఫక్కుమని నవ్వుతోంది.

యెవరో చాచి లెంపకాయ కొట్టినట్టయి, దిగ్గున లేచి కూచున్నాడు రాజేష్.

వెండి కప్పు పక్కనే ఫోటో... వైస్ ఛాన్సలర్ దగ్గరినుంచీ ప్రయిజునందుకుంటూ నవ్వుతున్నాడు తాను.

వెంటనే వెనక్కు తిరిగి నిలువుటద్దంలో తన ముఖాన్ని చూసుకున్నాడు.

'రేగిన జుట్టు, పాలిపోయిన ముఖం, చీకటితో తయారుచేసినట్టున్న వికృత మానవాకారం - తానే. వైస్ ఛాన్సలర్ చేతుల మీదగా బహుమతినందుకుంటున్న ఆ స్పురద్రూపికీ, యీ అష్టావక్రుడికీ పోలికెక్కడుంది ?- ఎలా వుంటుంది? ప్రజాస్వామ్యవాదమా? కమ్యూనిజమా ?- డిబేట్‌లో ప్రయిజు- అదిగో అదే ఆ షీల్డు. స్త్రీలకు సమానహక్కులవసరమా, కాదా ?- యెలక్యూషన్‌లో మళ్ళీ తనకే మొదటి బహుమతి- తన వాదన విన్న జడ్జెస్ ఆశ్చర్య చకితులై పోయేవారు. యింతటి ఆదర్శవాది సైతం వుంటాడా అని ముక్కున వేలేసుకునే వాళ్ళు అందరూ. ఆదర్శం తన టేబుల్ పైని షో పీస్ ఆదర్శం తన వేషం. ఆదర్శం తన మేకప్- అది తొలగిపోతే మిగిలేదేమిటి ? యిదిగో యిదే !... అద్దంలోని ప్రతిబింబం తనకే వికృతంగా కనిపిస్తోంది...'

యెవరో తరుముతున్నట్లుగా పైకి లేచి స్విచ్ అన్ చేశాడు.

ట్యూబ్‌లైటు నాలుగైదుసార్లు విసుక్కుని, చివరకు తప్పదన్నట్టుగా వెలిగింది.

టైంపీస్‌లో విమానం బొమ్మను అతికించుకున్న పెద్దముల్లు నిర్విరామంగా పరిగెడుతోంది

రాజేష్ బ్రష్‌తో తల దువ్వుకున్నాడు. ముఖానికి పౌడరు రాసుకున్నాడు. మరోసారి తన ప్రతిబింబాన్ని పరీక్షించి చూసుకున్నాడు.

'యిప్పుడు పరవాలేదు. కానీ ... యేమిటది ? పౌడరుపూత తెరలా అడ్డుపడినా, లోపల యేదో వికృత శరీరం కదలుతున్నట్లుగా వుంది ...'

గబగబా బట్టలు తొడుక్కుని, గదిలోంచీ బయటకొచ్చేశాడు.

బీగం తగిలించి, మోటార్‌బైక్ స్టార్టు చేశాడు.

హోటల్‌కెళ్ళి వేడివేడిగా వో కప్పు కాఫీ తాగాడు.

యెక్కడికి వెళ్ళాలన్న సందేహం కలిగింది.

సాయంకాలం యెలాగయినా నర్సింగ్‌హోం కొస్తానని మాటిచ్చాడు తాను. గంట యేడు కావస్తోంది.

ప్రశాంతి నర్సింగ్‌హోమ్ వైపుకు వాహనాన్ని మరల్చాడు.

యెవరిదో పెళ్ళి వూరేగింపు యెదురయింది. మల్లెపూలతో అలంకరించిన యెరుపురంగు వోపెన్ కారులో నూతన వధూవరులు వూరేగుతున్నారు.

రోడ్డు మలుపు తిరగగానే, కార్పొరేషన్‌వాళ్ళ శవవాహనం యెదురయింది. యెవరో ఘరానావ్యక్తి పోయినట్టున్నాడు. నల్లటి బ్యాడ్జీలు ధరించిన వ్యక్తులు కొందరు శవవాహనాన్ని అనుసరిస్తున్నారు.

'జీవితంలో పుట్టుక యెంత సహజమో, మరణమూ అంతే సహజం. యిద్దరు మనుషుల్ని వొకటిగా కూర్చిపారేసే బంధం పెళ్ళి. వొక వ్యక్తిని మిగిలిన ప్రపంచం నుంచీ బలవంతంగా లాగిపారేయడం మరణం. కేవలం వొక వ్యక్తి నిష్క్రమించినంత మాత్రాన, మిగిలిన వ్యక్తులు శాపగ్రస్తులు కావలసిందేనా ? చనిపోయినవాడికి సైతం ఆత్మ అంటూ వొకటుంటుందని, పరాయి ప్రపంచంలో వాడికి సద్గతులు లభించాలని నానాహంగామా చేసే ప్రపంచం, బ్రతికినవాళ్ళ అతీ గతీ పట్టించుకోకపోవడం న్యాయమేనా ?''

యెవరో పకాలున నవ్వినట్లయింది.

బ్రేక్ వేసి చుట్టూ చూశాడు రాజేష్.

రోడ్డుపైన వాహనాలు అటూ, యిటూ పరుగిడుతున్నాయి. పేవ్‌మెంట్లపైన జనం తొక్కిసలాడుకుంటున్నారు. దుకాణాలనిండా గుంపులు గుంపులుగా జనం ... ఎవరి ధ్యాసలో వాళ్ళు ... ఎవరి గొడవల్లో వాళ్ళు ... ఎవరి జీవన పోరాటంలో వాళ్ళు ...

మరి తనని చూసి నవ్విందెవరు ?

మోటర్‌బైక్ మళ్ళీ కదలింది.

'సైతాను ధర్మసూత్రాలు వల్లిస్తుంది. దెయ్యం సత్యం పలుకుతోంది. తన మనస్సు ఆదర్శంవైపు మొగ్గుతోంది. యీ ప్రపంచం నవ్వుతోంది. తనని జూసి ... నవ్వుకోనీ ... తనకెందుకు భయం ? జీవితం తనది. యీ ప్రపంచానికేం పోయింది ? చేజేతులా తన జీవితాన్ని ముళ్ళకిరీటంగా మార్చుకోమంటుంది. అగ్నిగుండం చేసుకోమంటోంది. నో, కావాలంటే ఆదర్శాల గురించి వుపన్యసిస్తాను. ఎవరైనా పాటిస్తే వాణ్ణి మహాత్ముడని అభినందిస్తాను. అంతే గానీ ... అంతేగాని ...'

నర్సింగ్‌హోమ్ ముందు ఆగిన వాహనాల్లో. సాగర్ మోటరు బైక్ కూడా కనిపించింది.

మోటారుబైకును లాక్ చేసి, లోపలికి వెళ్ళాడు.

చూడ్డానికి వొకే రకంగా కనిపిస్తున్న స్పెషల్ వార్డులోని గదుల్లో, మానస గదిని కనిపెట్టటానికి కొంచెం యిబ్బంది పడవలసి వచ్చింది.

ఆ గదిలో నిశ్శబ్దం ఘనీభవించినట్టుంది.

మంచంపైన మానస తీగలు తెగిన వీణలా ముడుచుకుని పడుకొని వుంది.

చూస్తున్న పేపరును పక్కన పడేసి, పలకరించడం కోసం విశ్వ ప్రయత్నం చేశాడు కృష్ణమూర్తి. తన ప్రయత్నం ఫలించక పోవడంతో వెలవెలబోతున్న చిరునవ్వు నొకదాన్ని అరువు తెచ్చుకున్నాడు.

నారింజపండ్లతో కుస్తీపడుతున్న అన్నపూర్ణ "రా నాయనా !" అంటూ కుర్చీ చూపెట్టింది.

గదిలోకి మరో వ్యక్తి ప్రవేశించిన సంగతి సైతం మానసకు అవగతమయినట్టు లేదు.

ఎవరిని పలకరించాలో తోచలేదు.

యేమని ప్రశ్నించాలో స్ఫురించలేదు.

రాజేష్ తనలో తానే తికమక పడిపోసాగాడు.

నాలుగయిదుసార్లు మాట్లాడడానికి ప్రయత్నించి విఫలుడైపోయాడు.

చివరకు "డాక్టరేమన్నాడు ?" అంటూ ప్రశ్నించాడు.

సమాధానంగా కృష్ణమూర్తి నిట్టూర్చాడు.

అన్నపూర్ణ వోసారి తలపైకెత్తి చూసింది.

"మీ అమ్మానాన్నా యేం తింటున్నారోయ్! యింకా పడుచువాళ్ళలాగే హుషారుగా కనిపిస్తున్నారు." అంటూ ప్రశ్నించేవాడు తాను. మరి కొందరు మిత్రులు షష్టిపూర్తిలో మీ అమ్మానాన్నల్ని కొత్తపెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ అనుకునే ప్రమాదముంది, జాగ్రత్త !-" అంటూ సాగర్‌ను వేళాకోళం చేసేవాడు కూడా ! పదిరోజులయినా గడచీగడవక - మనుషులో యెంతమార్పు ! వాళ్ళిద్దరూ వొక్కసారిగా ముసలి వాళ్ళయిపోయారు.'

"సాగర్ యెక్కడున్నాడు ?" అపస్వరాలు వెలువడడం ఆ గది స్వభావమేమోననిపించింది అతడికి.

"డాక్టరు దగ్గరకి వెళ్ళాడు" అన్నపూర్ణ పళ్ళరసం గ్లాసు మానస దగ్గరికి తీసుకెళ్తూ సమాధానం చెప్పింది.


"మానస డైట్ తీసుకొందా !"- అడగ కూడదని అనుకుంటూనే ప్రశ్నించాడు.


"ప్చ ! ఫ్లాస్కులోని పాలు అలాగే ఉన్నాయి. పళ్ళరసం గ్లాసులు గ్లాసులుగా పారబోస్తున్నాను. గ్లూకోజు పాకెట్టు తెరిచింది తెరిచినట్టుగానే ఉంది. చిన్న బిడ్డనయితే కొట్టి, మందలించి, తినిపించవచ్చు కానీ..." ఆమె మాట్లాడలేకపోయింది.

కృష్ణమూర్తి లేచి మానస పడుకున్న మంచంపైకి వెళ్ళి కూచుని, "అమ్మాయ్, లేచి జ్యూస్ తీసుకో ! నా మాట విను..." అంటూ ప్రాధేయపడసాగాడు.

రాజేష్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

'గల గల పారే సెలయేరు...సాయంకాలాల్లో వీచే మలయానిల వీచిక...వికసించిన సన్నజాజుల దొంతర...చీకటి హర్మ్యంలో అల్లల్లాడని దోర యెరుపు రంగు దీపకళిక...యెన్ని వూహలు !...యెన్ని అనుభూతులు !... రోజుకోరకంగా కనిపించేది ఆమె. ప్రతిరోజూ వొక కొత్త వ్యక్తిని చూస్తున్నట్టుగా అనిపించేది. గదికెళ్ళికూచుని, ఆమెకు సరితూగే వుపమానం కోసం గంటల తరబడి ఆలోచించేవాడు తాను. కానీ...కానీ...యెందుకిలా ? యేం మించి పోయిందని యిలా కృంగిపోతున్నావు మానసా నువ్వు ? యేం కొంపమునిగింది ?



యీ భూప్రపంచంలో రోజూ రాలిపోతున్న లక్షలకొలది మానవమాత్రులలో చిరంజీవి కూడా వొకడు. వాడొకడు పోయినంత మాత్రాన యేం పుట్టిమునిగిపోయిందని ? కొండంత జీవితం నీ ముందుంది. యెందుకిలా నిరాశపడిపోయావు నువ్వు ?'

"సాగర్‌ను కలిసి..." తనలో తానే గొణుక్కుంటూ గది బయటకు నడిచాడు రాజేష్.

డాక్టరు గదిలోంచీ రకరకాల గొంతుకలు బిగ్గరగా వినిపిస్తున్నాయి.

బాయ్‌ని కేకేసి సాగర్‌కోసం వాకబు చేశాడు.

"రాజూ..." సాగర్ కంఠం వినిపించింది.

తిరిగి చూశాడు.

మేడమెట్లు దిగుతూ కనిపించాడు సాగర్.

అతడు దగ్గరికి వచ్చాక, "డాక్టరు దగ్గరి కెళ్ళామని అంటేనూ..." అంటూ ముందుకు కదిలాడు రాజేష్.

"లేదు. మేడపైన చల్లగా గాలి వీస్తోంది. అందుకని..."

"ఒంటరిగానా ?"

"అవును... యేమీ తోచలేదు. అందుకని తార్డ్‌స్టేర్లోకెళ్ళాను. ఓపెన్ ప్లేస్... పిట్టగోడపైనకూచుని, నువ్వొస్తావేమోనని రోడ్డుకేసి చూస్తూ కూర్చుండిపోయాను. అవునూ, నువ్వొచ్చి యెంతసేపయిందీ ?..."

"ఇప్పుడే !"

"నిజంగా రోడ్డుకేసి చూస్తున్నట్టయితే, తానొచ్చిన సంగతి తెలియకుండా యెలావుంటుంది ? యీ సాగర్ ఇంకా పలాయనవాదంనుంచీ బయట పడలేదు. గదిలో కూచోలేక, మేడపైకెక్కి వో మూల కూచుని, గుప్పెడు సిగరెట్లు తగలేసి వుంటాడు. రాజేష్‌కు కోపం వచ్చింది.

"వెళ్దామా ?" అన్నాడు సాగర్.

"ఎక్కడికి ?" రాజేష్ ప్రశ్న కటువుగా వినిపించింద.

"నేను భోంచేయాలి. ఆకలిగావుంది. ముందు హోటలుకు...తరువాత యెక్కడికయినా..."

మిత్రుడినోసారి పరకాయించి చూశాడు రాజేష్, 'లాభంలేదు. వీడు మధ్యాహ్నమేగాదు, నిన్నరాత్రి సైతం భోంచేసినట్టులేడు.'

"అమ్మతో వెళుతున్నానని చెప్పాలి. కాస్సేపాగు" అంటూ గదిలోకి వెళ్ళి, రెండు నిముషాలలోనే తిరిగొచ్చేశాడు సాగర్.

మరో అయిదు నిముషాలకంతా, నర్సింగ్‌హోంనుంచీ రెండు మోటారు బైకులు నగరంలోకి పరుగులు తీశాయి.

పదిహేను నిముషాల ప్రయాణం తరువాత, మిత్రులిద్దరూ హోటల్ చేరుకున్నారు.

"రూఫ్‌గార్డెనుకెళ్దాం" అంటూ తానే లీడ్ చేశాడు సాగర్.

లిఫ్టు అయిదో అంతస్థుపైకి తీసుకెళ్ళింది.

రెండు మూడు టేబుల్స్ మాత్రమే 'ఫిల్‌అప్' గావడంచేత, రూఫ్‌గార్డెన్సులో వాతావరణం ప్రశాంతంగా వుంది.

నగరపు వెలుతురుతో పోటీపడలేక ముఖం వేలాడేసుకున్న చంద్రుడు, కూతవేటు దూరంలోనే వున్నట్టుగా కనిపిస్తున్నాడు.

ఫ్యాక్టరీ పొగలధాటికి తట్టుకోలేక, మేఘాలు పలాయనం చిత్తగించినట్టున్నాయి.

నగరపు రోడ్లపైన జరుగుతున్న దీపాల జాతరని రూఫ్‌గార్డెన్సులోంచీ ఎంతసేపు చూసినా తనివి తీరడంలేదు.

మిత్రులిద్దరూ ఒక టేబుల్‌ముందు కూర్చున్నారు.

బేరర్ 'మెనూ' తీసుకొచ్చి టేబుల్‌పైన పెట్టాడు.

"ఆర్డర్స్ నేనేయివ్వనా" సాగర్ చిరునవ్వు నవ్వుతూ ప్రశ్నించాడు.

అతడివైపే, విస్తుపోయి చూస్తూ వుండిపోయాడు రాజేష్.

"యేమిటలా చూస్తావ్ ? నువ్వే చెప్పు అలాగయితే..." మెనూ





మీరా ఎలాంటి మిక్సర్ తోనైన అన్యోన్యంగా ఉంటుంది.

ఏలాంటి భారతీయ లేదా దిగుమతి చేసుకొన్న మిషినుకైన సరిగ్గా అమరి ఉండే ఏకైక స్టెయిన్‌లెస్‌స్టీల్ గ్రైండర్ ఎటాచ్‌మెంట్స్.
మీరా గ్రైండర్ ఎటాచ్‌మెంట్ శ్రేష్ఠమైన స్టెయిన్‌లెస్‌స్టీలుతో చేయబడినది.
ఎక్కువ పదార్థాన్ని రుబ్బటానికి పెద్ద గ్రైండర్ కప్పు మరియు లోపలి భాగము కనబరచే విరగని మూకుడు.
దీర్ఘకాలం నిలచి, త్వరితంగా, సులువుగా రుబ్బటానికి ప్రత్యేకంగా రూపొందించబడి పదునైన రంపపుపళ్ళ బ్లేడు కలది.

మీరా meera
యూనివర్సల్ గ్రైండర్ ఎటాచ్ మెంట్

4 సైజులలో మరియు
3 రకాలలో లభిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు
మహావీర్ ఎంటర్‌ప్రైజెస్, ఫోన్స్: 221198 34361
కాంచన్‌జంగ కాంప్లెక్స్, కింగ్ కోఠి రోడ్, హైదరాబాద్-1

ముందుకు తోశాడు అతను.

"లేదు... నువ్వే చెప్పు..."

మెనూ తెరిచి, సర్వర్‌కు ఆర్డర్ చెప్పాడు సాగర్.

రాజేష్ ఆశ్చర్యంలోంచీ తేరుకోలేదు. 'సాగర్ ముఖంలో నవ్వును చూసి యెన్నాళ్ళయింది? యింత తొందరగా ఇతడెలా తేరుకోగలిగాడు? సమ్‌థింగ్ ఈజ్ రాంగ్ విత్ హిమ్ ... ఏదో జరిగింది ... కొంపదీసి ... నో... అలా జరగడానికి వీల్లేదు... వీడి పలాయనంలో ఇదో మలుపు కాబోలు...'

"నాకు పిచ్చి పట్టిందనుకొంటున్నావుగదూ?" తానే ప్రశ్నించాడు సాగర్.

రాజేష్ వులిక్కిపడ్డాడు. "అబ్బే...నేను...అదిగాదు..." తడబడిపోయాడు.

సాగర్ మళ్ళీ ఒక చిరునవ్వు నవ్వాడు. "పరిస్థితులకు యెదురునిలిచి పోరాడమని సలహా ఇచ్చినవాడివి నువేగదా! మరి... నువే ఇలా స్టన్నయిపోతున్నావెందుకు?..."

"......"

"చూశావా రాజూ! సలహా ఇవ్వడం చాలా సులభం... పాటించడమే కష్టం. కానీ సందిగ్ధావస్థలో పడి కొట్టుకు పోయినంతవరకే ఫ్రస్ట్రేషన్... ఒక నిర్ణయానికి వచ్చాక, ఇక పరవాలేదు..."

"అంటే ...!?"

"జరిగిన గొడవ యెందుకు జరిగిందన్న వితర్కాన్ని అవతలికి నెట్టేశాను. నువ్వెళ్ళి క్యాంపు పేరుతో డ్యాం దగ్గరే వుండిపోయావు. యీ నాలుగు రోజుల్లో యెన్ని గొడవలు జరిగాయని? యెంత హంగామా జరిగిందని?...

"..............."

"చిరంజీవి అమ్మా నాన్నా హాస్పిటల్‌కు వచ్చి వెళ్ళారు. వాళ్ళకు కూడా యిది షాకే కదా! యింత తొందరగా వాళ్ళు మళ్ళీ మన ప్రపంచంలోకి వస్తారని అనుకోలేదు. కానీ... వచ్చి చూసి వెళ్ళారు. నేరుగా చెప్పలేక, వెళ్ళిన తరువాత యెవరో వొక పెద్దమనిషిని పంపారు. యేవేవో తతంగాలు యింకా మిగిలిపోయాయనీ, కోడల్ని యింటికి పంపమనీ కబురు మోసుకొచ్చాడు ఆ పెద్దమనిషి. యీ స్థితిలో మానసని వాళ్ళయింటికెలా పంపాలి?..."

"..............."

"అయినా యెందుకు పంపాలి? పంపిన తరువాత జరగబోయే పరిణామాలు యెలాంటివి? పట్టుమని పాతికేళ్ళయినా లేవు గదా! అప్పుడే అలాంటి ఘోరాలన్నీ యెందుకు జరగాలి? అమ్మా నాన్న యెటూ చెప్పలేక యేడుస్తూ కూచున్నారు... నిన్ననే చిరంజీవి వాళ్ళ యింటి కెళ్ళొచ్చాను. యిక ఆ యింటికీ, మానసకూ యెలాంటి సంబంధమూ లేదని కచ్చితంగా చెప్పేశాను. యెవరయినా చాద స్తపు చేష్టలు చేశారంటే, వాళ్ళ మొహం చూడనని మా అమ్మా నాన్నలతో కూడా చెప్పేశాను. యిదొక దుస్వప్నం. అంతే! మానసకసలు పెళ్ళే జరగలేదు. కోలుకున్న తరువాత, దాన్ని యెమ్మేలో చేరుస్తాను. తన యిష్టం వచ్చినంత వరకూ చదువుకోమంటాను..."

సాగర్ కేసి పరిశీలనగా చూశాడు రాజేష్. అతడు ఆవేశపడడం లేదు. నింపాదిగా, తనతో తానే మాట్లాడుకుంటున్నట్టుగా, చెప్పుకుపోతున్నాడు.

"జీవితంలో లొంగుబాటుకూ, సర్దుబాటుకూ తల వొంచకూడదని నిర్ణయించుకున్నాను. యివ్వాళ్టినుంచీ నాకున్నదొకటే లక్ష్యం. నిన్నటి వరకూ దుష్పరిణామాల్ని నిరోధించే పోరాటంలోనే గడచింది. యీ రోజునుంచీ నా ఆశయం వొకటే!... మానస జీవితం మళ్ళీ కుదుట పడాలి. మళ్ళీ మానస మామూలుగా తిరగాలి. అమ్మకూ, నాన్నకూ దాన్ని గురించిన చింత తొలగిపోవాలి. చూస్తూ వుండు రాజూ! మళ్ళీ మా మానస జీవితంలోకి వసంతాన్ని తీసుకొస్తాన్నేను..."

సాగర్ కళ్ళు మెరుస్తున్నాయి.

"ఆదర్శాలు వల్లించడం చాలా సులభం, కానీ రాజూ! నేను కోతలు కోయడం లేదు. నిజమే చెబుతున్నాను. మా చెల్లెలికి మళ్ళీ పెళ్ళి చేస్తాను. యివ్వాళ్టినుంచీ నా ధ్యేయం అదే! మానసకు పెళ్ళి చేసిన తరువాతే, నా పెళ్ళి జరుగుతుంది. యిది పందెం కాదు... నా జీవిత లక్ష్యం..."

రాజేష్ అనిమిషనేత్రుడై మిత్రుడివైపు చూస్తూ వుండిపోయాడు.

పొగలు క్రక్కుతున్న ట్రేతో బట్లర్ టేబుల్ దగ్గరి కొచ్చేశాడు. పింగాణీ ప్లేట్లు అమర్చి, వేడివేడి భోజనాన్ని వడ్డించాడు. ఖాళీ ట్రే తీసుకుని వెళ్ళిపోయాడు.

సాగర్ తినడం ప్రారంభించాడు.

రాజేష్ తన ప్లేటు ముందుకు లాక్కున్నాడు.

సాగర్ చకచకా భోం చేస్తున్నాడు.

రాజేష్‌కు అన్నం తినడానికి మనస్కరించడం లేదు. ప్లేటులో కెలుకుతూ కూర్చున్నాడు. 'వొకే రకమయిన పక్షులు వొకే గూటికి చేరుతాయని' అంటారు. తానూ, సాగర్ భవిష్యత్కార్యక్రమాల్ని గురించి, వూహాగానాలు సాగించేవాళ్ళు. కనీసం పదిమంది అభాగ్యుల్ని ఆదుకోలేని జీవితం, వృధా అవుతుందని అనుకునేవాళ్ళు. ఎన్ని ఆలోచనలు? ఎన్ని పథకాలు! రాజకీయాలతో ప్రమేయం లేని చారిటీ సొసయిటీ నొకదాన్ని స్థాపించాలి. అనాథ బాలలకు చదువు; వృద్ధులకూ, వికలాంగులకూ ఆశ్రయం; వితంతువుల కోసం హాస్టల్ - తమ ఆశయాల లిస్టు చాలా పెద్దది. ఆదర్శాలకు అంతెక్కడుంది? తమ ఆశయాల జాబితాతో వొక పుస్తకం తయారుచేస్తే, అది ప్రపంచంలోకెల్లా పెద్ద పుస్తకంగా గిన్నీస్ బుక్‌లో కెక్కుతుందని, జోక్ వేసుకుని నవ్వుకునేవాళ్ళు ... తనకంటూ యే యిబ్బందీ కలగనప్పుడు, యితరులకు ఆదర్శంగా బ్రతకమని సలహా యివ్వడం చాలా సులభం. అయితే వొకానొక పరీక్షా సమయంలో తానే వొక ఆదర్శానికి లోబడి నడచుకోవడం చాలా కష్టం! సాగర్ తన జీవితంలో ఆదర్శాలకూ, ఆచరణకూ లంకె కుదుర్చుకుంటున్నాడు. తన జీవితాన్నే వొక పరీక్షకు సిద్ధం చేస్తున్నాడు. యింతటి స్థిర సంకల్పుణ్ణి చూసి, తాను పలాయితుడని అనుకుంటున్నాడు.' రాజేష్ మథనపడసాగాడు.

భోజనం పూర్తయిన తరువాత చేతులు కడుక్కుంటూ, "నువ్వసలు సరిగ్గా తినలేదు, ఆకలిగా లేదా?" అంటూ ప్రశ్నించాడు సాగర్.

"అవును ..." అన్నాడు రాజేష్. కాస్సేపాగి, తరువాత అడిగాడు — "మరి ... మళ్ళీ పెళ్ళిచేసుకోవడానికి మీ సిస్టర్ వొప్పుకుందా?"

"వొప్పిస్తాను. నేను చెబితే తప్పకుండా వొప్పుకుంటుంది. ఇది కష్టమయిన పనే! నాకూ తెలుసు ... కానే నేనీ పని చేసి తీరాలి ..."

"కానీ ..."

మిత్రుడికేసి సూటిగా చూశాడు సాగర్. "నీ సందేహం ఏమిటో నాకూ తెలుసు. వొకసారి పెళ్ళయిన అమ్మాయిని పెళ్ళాడ్డానికి ఎవరు ముందుకొస్తారని గదూ నీ అనుమానం? వెతుకుతాను. గాలిస్తాను. యింత ప్రపంచంలో వొకడయినా మానవత్వమున్న మనిషి దొరక్కపోడు. దేశం గొడ్డుపోలేదు రాజూ! నూరుమందిలో దొరక్కపోవచ్చు. వేయిమందికి...కనీసం లక్షమందిలో అయినా వొక్కడు - వొక్కడంటే వొక్కడు వుండకపోడు. ఆ మనిషికోసం వెదుకుతాను ..."

రాజేష్‌కు వున్నట్టుండి యేదో వొకశక్తి తనను ఆవరించినట్టుగా తోచింది. 'ఆదినుంచీ ప్రతి విషయంలోనూ తామిద్దరూ భాగస్వాములుగా వుంటూ వచ్చారు. కానీ యీనాడు సాగర్, వో మహత్తరమైన కార్యాన్ని నిర్వర్తించడంలో తనను వెనక్కు నెట్టేసి ముందుకెళ్ళిపోతున్నాడు. తానిది సహించలేడు. వస్తున్నాను ... యిదిగో, సాగర్! నేనూ నీతో కలసి పరిగెత్తబోతున్నాను. యేదీ, నీ చేయి అందించు...' అతడి పెదవులు కదిలాయి- "నీకా వ్యక్తిని వెతికి పట్టుకోవల్సిన శ్రమ నెలాగయినా తప్పించాలని వుంది... సాగర్! నీకు మరెలాంటి అభ్యంతరమూ లేకపోతే, యీ పని చేయడానికి కావల్సిన అర్హతలు నాలోనూ వున్నాయని నీవనుకుంటే - నేను... నేను మానసని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధంగా వున్నాను..."

## 4

**చు**ట్టూ బీటలు వారిన నేల. గరిక పోచయినా మొలవలేదు. మధ్యలో చేద బావి. కొంగు నడుం చుట్టూ బిగించి, నీళ్ళు తోడుతోంది ఆమె. రేగిన జుట్టూ, లోతుకు పోయిన కళ్ళూ, కష్టనష్టాలను భరించీ, భరించీ అలసిపోయినట్టున్న ముఖం. బావిలోంచీ బయటి కొచ్చిన చేంతాడు కొండవీటి చేంతాడంత పొడవుంది ఆమె వాలకం చూస్తే, యింకా మరింత పొడవున్న చేంతాడు బావిలోనే వున్నట్టుంది.

పాతాళంలోని నీళ్ళు... యెంతకీ పైకి రాని నీళ్ళ కడవ... తెల్ల కార్డ్ బోర్డుపైన యిండియన్ యింకుతో గీసిన బొమ్మ అది...

మంచంపైన సోలిపోయినట్టుగా కూచున్న మానస చూపులు చాలా సేపటినుంచీ యెదుటి గోడకు వ్రేలాడుతున్న బొమ్మపైన్నే వున్నాయి.

ఆ బొమ్మకు ఉపయోగించిన బాక్ గ్రౌండును గురించి గాని, ఆ స్త్రీ పరిస్థితి గురించి గానీ, ఆమె ఆలోచించడం లేదు. ఆ మాట కొస్తే ఆమె యే యితర విషయం గురించీ గానీ ఆలోచించడం లేదు. ఆలోచించి, ఆలోచించీ ఆమె మనస్సు మొద్దుబారిపోయింది. కానీ ఆ బొమ్మవైపు చూస్తూన్నప్పుడు తన కేదో వుపశమనం కలుగుతున్నట్టుగా ఆమెకు అనిపించసాగింది.

యెప్పుడో హైస్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో, ఆబొమ్మగీసింది మానస. ఆ రోజు సెలవు. యేమీ తోచలేదు. పుస్తకాల బీరువా సర్దుతోంటే, డ్రాయింగ్ షీటు దొరికింది. సగం మిగిలిన యిండియన్ యింకు బాటిల్ దొరికింది. మానస రెండు గంటలసేపు పట్టుగా కూచుని ఆ బొమ్మ గీసింది. బావి గీసిన తరువాత, నీళ్ళు చేదుతున్న స్త్రీని గీస్తే బావుంటుందని తోచింది. బావి చుట్టూ పచ్చని పట్టొకటి వుంటే బావుంటుందేమోనని కాస్సేపు ఆలోచించింది. యెందుకో మనస్కరించలేదు. అప్పటికే యింకు అయిపోయింది. బ్రష్‌లో మిగిలిన యింకుతో నేలపైన పీటలు మాత్రమే గీయొచ్చు.

"పెసిమిస్టిక్ ట్రాష్. చించిపారెయ్యి" అన్నాడు సాగర్.

మానస యేడుపు మొఖం పెట్టింది.

"లోపం బొమ్మలో లేదు. నీ దృష్టిలోనే వుంది. ఆమె పట్టుదలకు సింబల్ ... యిట్ షోష్‌ది యిండామిటబుల్ స్పిరిట్ ఆఫ్ ది హ్యూమన్ బీయింగ్ ... సాయంకాలం బజారు కెళ్తున్నప్పుడు నా కివ్వమ్మా ... ఫ్రేమ్ చేయిస్తాను..." అన్నాడు కృష్ణమూర్తి.

"థాంక్స్ నాన్నా !" అంది మానస.

ఆ మరునాటి నుంచీ, ఆ బొమ్మ మానస గదిలో వ్రేలాడుతోంది.

నీలరంగు గోడలు ... పసుపురంగు కిటికీలు ... ముదురు వంకాయ రంగు కిటికీ తెరలు ... కిటికీ కవతల ఆకుపచ్చరంగు కొమ్మల పింఛాన్ని విప్పి నిల్చున్న చెట్టు ... గదిలో, వో చివర్న బూడిదరంగు బీరువా, టేబుల్‌పైన ఎర్రటి టేబుల్‌క్లాత్ ... తెల్లగా మెరుస్తున్న టేప్ రికార్డర్ ... రంగులు - యింద్రధనుస్సు విరిసినట్టు ఎటు చూసినా రంగులు రంగులు. కానీ, చిత్ర విచిత్రమైన వర్ణ విన్యాసంలో కనిపించని వోదార్పు తెలుపు నలుపుల్లోనే దొరుకుతోంది ఆమెకు. రంగులన్నీ భ్రమలుగా కన్పిస్తున్నాయి మానసకు. 'జీవితంతో వున్నవి రెండే రంగులు - వొకటి తెలుపూ, వేరొకటి నలుపూ ... తెలుపు నలుపుల్లో తెలుపు దెపుడూ వెనకడుగే ... నలుపు సత్యం ... నలుపు నిత్యం ... ఆలోచనలేక మొద్దుబారిన హృదయంలో నలుపు. రేపుపైన ఆశలేకపోతే మిగిలిందేమిటి ? కారునలుపు' - మానస చూపులు ఆ బొమ్మపైనే తారట్లాడుతున్నాయి.

ఆమె రిస్ట్‌వాచీ అలారం గొంతువిప్పి, కుయ్ కుయ్ మంటూ, హృదయాన్ని శూలాల్తో గుచ్చినట్టుగా అరుస్తోంది.

గడియారం చూసుకోవలసిన అవసరంలేదు - సమయం పదకొండు గంటలా మూడు నిముషాలు. ఆగష్టు పదవతేదీ రాత్రి, గడియారం తీసుకుని పన్నెండు గంటలా మూడు నిముషాలకు అలారం పెట్టాడు చిరంజీవి. యిరవై సంవత్సరాల క్రితం, ఆగష్టు పదవతేదీ మధ్యాహ్నం పదకొండు గంటలా మూడు నిముషాలకు ఆమె పుట్టింది.

"అంటే యీ అలారం మ్రోగిన తరువాత గానీ నేను యిరవయ్యో యేడులోకి అడుగు పెట్టనన్న మాట ..." అంది మానస.

"ఎవరన్నారామాట ? నీకింకా యేడాదయినా నిండలేదు." అన్నాడు చిరంజీవి.

ఆమె కతడి వుద్దేశమేమిటో అర్థం కాలేదు

"ప్రాచీన గ్రీకు దేశంలో ఆడవాళ్ళ వయస్సును పెళ్ళయినప్పటి నుంచీ లెక్కించడం మొదలు పెట్టేవాళ్ళట ... కాబట్టి నీ వయస్సింకా ఆరు నెలలే ..." చిరంజీవి నవ్వసాగాడు.

అలారం మోగుతోంటే చిరంజీవి నవ్వుతున్నట్టే వుంది.

బీరువాలో పడేసిన వాచీని తీసుకొచ్చి, "యీ ఆటోమేటిక్ వాచీ కట్టుకోకపోతే ఆగిపోతుందట ..." అంటూ తానే కూతురి చేతికి కట్టింది అన్నపూర్ణ.


'తననెలాగయినా, మరో ధ్యాసలోకి మళ్ళించాలని ఆమె తపన. అదెలా కుదురుతుంది ? ఆ యింట్లో వుంటే అతడే జ్ఞాపకం వస్తూ వుంటాడని యిక్కడికి రమ్మన్నావు. అతడికి సంబంధించిన వస్తువులేవీ కంటబడనివ్వకుండా జాగ్రత్త పడుతున్నావు. కానీ, నీడను ఆకారంనుంచీ ఎలా వేరు చేయగలవు నువ్వు ? పెళ్ళయిన మరుక్షణం నువ్వేమన్నావు? వొక క్షణమైనా విడిచి పెట్టకుండా, నీడలా వెన్నంటి వుండమన్నావు. యిప్పుడేమయింది ? అసలు శాల్తీ లేదు. నీడ మాత్రమే మిగిలింది. బయట ఎక్కడో వుంటే అతడ్ని నానుంచీ దూరం చేయగలరు మీరంతా ... నాలోనే వుంటే మీరేం చేయగలరు ? ...'


బుగ్గలపైనుంచీ జారిన కన్నీటిధార పెదవులపైన ఆగింది.

"పేరు చిరంజీవి ... యింత అల్పాయుష్కుడికి ఆ పేరు పెట్టి మన కొంప గుండం చేశారు..." కృష్ణమూర్తి హాల్లో కూర్చుని గొణుక్కుంటున్నాడు.

'అయ్యో పిచ్చి నాన్నా ! ఆయన నిజంగా చిరంజీవే ! మనిషినయితే దూరం చేయగలిగారు గానీ, అతని ప్రభావాన్ని తొలగించగల వాడెవ్వడున్నాడు? సంసారం చేసింది ఆరు నెలలే గావచ్చు. కానీ దాని ప్రభావం చిరంజీవి ... ఆ అనుభూతి చిరంజీవి ... ఆ అనుభూతి తాలూకు వ్యక్తి యిక కంటికి కనిపించడని తెలిసినప్పుడు, అనుభవించవలసి వస్తున్న విషాదం చిరంజీవి ...'

"అలా ఎంతసేపు కూర్చుంటావు మనూ ? యివ్వాళ శనివారం ... నువ్వు మామూలుగా గుడికెళ్ళే రోజు ... లేచి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో ... నేనూ వస్తాను ..."





మానస వెనుదిరిగి చూసింది.

సాగర్ మంచం వెనుకే నిల్చుని వున్నాడు.

పెల్లుబికి రాబోయిన యేడుపును బలవంతంగా గొంతులోనే అణచి పెట్టడానికి విశ్వప్రయత్నం చేసింది మానస.

"డు నాట్ బీ సిల్లీ ... డ్రైవ్ అవేది సెంటిమెంటల్ యెగొనీ ... ఎందుకంత బేలగా మారిపోయావు ? యిప్పుడేం కొంప మునిగిందని ? లేచి బయల్దేరు. నేనూ బట్టలు మార్చుకోవాలి ...మళ్లీ అయిదు నిముషాల తరువాత యిక్కడి కొస్తాను. నువ్వు రెడీగా వుండాలి ..."

సాగర్ వెళ్ళిపోయాడు

'యిప్పుడేం కొంప మునిగిందని ? యిలాగంటున్నావేమిటన్నయ్యా నువ్వు ? కొంప గుండమైపోయిందసి నాన్న వాపోయి అయిదు నిముషాలయినా కాలేదు. యింకా యేం జరగాలి ? యింకేం మిగిలింది నాకు ? శూన్యం, విషాదం, యెగొనీ, టార్చర్ ... అంతే ! చిరంజీవి ! ఎంత దుర్మార్గుడు ! అంత ప్రేమగా ఎవరుండమన్నారు నాతో ! నేను తప్ప తనకు మరో లోకం లేదని అన్నిసార్లు ఎందుకు చెప్పాలతను ? ఎంత సునాయాసంగా మోసం చేయగలి గాడు !'

"మీ అన్నయ్య బయల్దేరేశాడు. నువ్వింగా కదల్లేదన్నమాట !" అన్నపూర్ణ మందలిస్తోంది.

మానస తల్లికేసి చూసింది.

ఏమీ జరగనట్టుగా నటించడం కోసం విఫల ప్రయత్నం చేస్తోంది ఆమె. కానీ ... కళ్ళల్లో ఎందుకంత విచారం ? గొంతుకలో ఎందుకంత విషాదం ?

కూతుర్ని బలవంతంగా పైకి లేపి, ముఖం కడిగించింది ఆమె. బట్టలు మార్పించి, తల దువ్వించి, ముఖానికి కొంచెం పౌడరు అద్ది, చివరికి బయటికెళ్ళడానికి వీలయ్యేలా తయారు చేసింది.

సాగర్ స్కూటర్‌పైన కూర్చుని ఎదురు చూస్తున్నాడు.

మానస వెనుక సీటుపైకెక్కి కూర్చొంది.

స్కూటర్ స్టార్టయింది.

"యీ రోజు పాలిటిక్స్ డిపార్టుమెంటులో ఏం జరిగిందో నీకు తెలుసా మనూ ? ప్రొఫెసరూ, హెడ్డూ వరండాలో కుస్తీ పట్టేశారు. స్టూడెంట్లం దరూ రెండు గ్రూపులయిపోయి, డిపార్టుమెంటును యుద్ధభూమిగా మార్చిపారే శారు. యూనివర్శిటీలోని స్టూడెంట్లందరూ తమ తమ స్నేహితులకు సహాయం చేయడం కోసం ఆయుధాలతో సహా రంగంలోకి దూకేశారు. వీసీ ఫోన్లపైన ఫోన్లు కొడితే పోలీసులు వాన్ల నిండుకూ దిగేశారు. మధ్యాహ్నం పైన పరిస్థితి కొంచెం అదుపులోకి వచ్చింది. యింతకూ హెడ్డూ, ప్రొఫెసరూ ఎందుకు గొడవ పడ్డారని వాకబు చేస్తే స్టూడెంట్లందరూ బిక్కమొహం పెట్టేశారు. కారణం తెలియకుండానే పోట్లాటకు సిద్ధమైపోయారన్నమాట ! ..."

'తన ధ్యాసను మరల్చడం కోసం అన్నయ్య కబుర్లు చెబుతున్నాడు. అన్నయ్యిలా కబుర్లు చెప్పి యెన్నాళ్ళయిపోయింది ? తనకు పెళ్ళిగాకమునుపు, ప్రతిరోజూ యిలాగే యూనివర్శిటీ విశేషాలు చెప్పేవాడు. పెళ్ళయ్యాక అన్నయ్యతో మాట్లాడ్డానికి తీరికెప్పుడు దొరికేడ్చింది ? అన్నయ్య మాటల్ని వింటూంటే మళ్లీ ఆ రోజులు జ్ఞాపకం వస్తున్నాయి. పెళ్లీ, చిరంజీవి- యేదో పుక్కిటి కథలో నారదుడికి కలిగిన స్వప్నభ్రమలా కనిపిస్తున్నారు.'

స్కూటరొకటి, తుర్రుమని వోవర్‌టేక్ చేసుకుని, దూసుకెళ్ళి పోతోంది. వెనక కూర్చున్న అమ్మాయి, డ్రైవ్ చేస్తున్న వ్యక్తిని వాటేసుకుని, వొయ్యారంగా నవ్వుతోంది.

'అయ్యో పిచ్చిదానా ! యెంత భ్రమలో వున్నావు నువ్వు ? నువ్వెంత గట్టిగా కౌగిలించుకుని కూర్చున్నా, ఒకనాడు అతగాడు నిన్ను నిర్దాక్షిణ్యంగా విదిలించిపారేసి, యెటో వెళ్ళిపోతాడు. ఈ మూన్నాళ్ళ ముచ్చటే నిజమని అనుకుంటున్నావు నువ్వు... వొద్దు... మోసపోవద్దు...'

"నీకు చెప్పడంకంటే మౌనంగా వుండడమే మేలు ! ఆలోచించింది చాలుగానీ యిక దిగు..." సాగర్ విసుక్కుంటుండగా వులిక్కిపడి, స్కూటర్ దిగిండి మానస.

గుడిదగ్గర సందడి అంతగాలేదు.

మెట్లదారి దగ్గర కొందరు బిక్షగాళ్ళు బారులు తీరి కూర్చున్నారు.

"ఈ గుడిని చూసినప్పుడల్లా మా రాజేష్ యేమంటాడో తెలుసా మనూ ?" మెట్లెక్కుతూనే చెప్పుకు పోతున్నాడు సాగర్. "ఎక్కడో, ఏ ఏకాంత ప్రదేశానికో వెళ్ళాలనుకొని ప్రయాణమై, దారితప్పి నగరంలోకొచ్చి నిల్చుని, ఎటువెళ్ళాలో తోచక స్థాణువై నిల్చుండిపోయిన కాందిశీకుడిలా వుంటుం దట యిది ! ఈ గుడిని కట్టక మునుపు, ఈ గుట్ట మునిసిపాలిటీ వాళ్ళకు చెత్త కుండీలా పనికొచ్చేది. రాజేష్ యేమంటాడో తెలుసా ? యిలాంటి మెకానికల్ సిటీకి అటువంటి దిబ్బ ఉండడమే సహజంగా వుంటుందట ! ఈ గుడిని కట్టి, దీన్నొక టూరింగ్ స్పాట్‌గా తయారుచేయడం యెబ్బెట్టుగా వుందట !... చిత్రంగా లేదూ వాడి ధోరణి !"

గుట్టపైన్నుంచీ వూరంతా కనిపిస్తోంది

గర్భగుడిలో పాలికేళ్ళ వయసున్న పూజారి ఏదో సర్దుకుంటున్నాడు.

"ఇలా కూచుందాం మనూ ! కాంపౌండువాల్‌పైన కూచోడం నీకెలాగూ యిష్టమేగదా ! అలా కూచో... యేం చెబుతున్నానూ ?...

మానస బిక్కమొహం పెట్టింది.

సాగర్‌కు చెప్పలేనంత కోపం వచ్చింది. "వసపోసిన పిట్టలా నేనేమో యిలా వాగుతూనే వున్నాను. నువ్వేమో, ఏమీ వినిపించుకోవడం లేదు. నీకేం చెప్పానన్నేను ? అలా ఏదో పుట్టిమునిగిపోయినట్టుగా కూచోవద్దన్నాను గదా ? అప్పుడేం జరిగింది ? అతను పోయాడు. అంతేగదా ! అంతమాత్రానికే ఇంతగా బెంబేలు పడిపోవాలా ? అనెజ్‌కేటెడ్ బ్రూట్‌లా ఏడుస్తూ కూచోవడానికి సిగ్గయినా కలగడంలేదా నీకు ? ఇదేనా నువ్వు చదువుకొంది ? 'కంబాటివ్ స్పిరిట్' వుండాలని పుస్తకాల్లో చదివి భుజాలెగరేస్తే సరిపోయిందా ? ఇదేనా నువ్వు జీవితాన్ని అర్థం చేసుకున్నది ? అదిగో, అదే వద్దన్నాను. యిక ఏడిస్తే నేనూరు కోను..."

మానస గ్రుక్కిళ్ళు మింగసాగింది.

"చిన్నపిల్లలా ఏడుస్తూ కూచోకు మానసా ! కాస్త అర్థం చేసుకో డానికి ప్రయత్నించు." కాస్సేపు మౌనంగా వుండిపోయిన తరువాత, అనునయిస్తూ మాట్లాడసాగాడు సాగర్- "పెళ్ళయిన తరువాత, జీవిత భాగస్వామి చనిపోతే, ఇక మిగిలిన శాల్తీకి జీవితమే వుండదని అనుకుంటున్నావేమో నువ్వు ? ఎవరిదాకానో యెందుకు ? తాతయ్య చెబుతూ వుండేవాడు, నీకు జ్ఞాపకముందా ? మొదటి భార్య చనిపోయాక, ఇక పెళ్ళొద్దని, సన్యాసుల్లో కలిసిపోతాననీ నాన్న మొరాయించుకుని కూచున్నాడట ! తరువాతేమయింది ? రెండో పెళ్ళి చేసుకోకుండా వున్నాడా ఏమయినానా ? మన అమ్మ, నాన్నకు రెండవ భార్యని చెబితే యెవరయినా నమ్ముతారా చెప్పు ?"

"నాన్నయితే మొగవాడు..." అంది మానస జీరబోయిన గొంతుకతో.

"అయితే ఏమిటి ? ఆడవాళ్ళు మాత్రం రెండోపెళ్ళి చేసుకోగూడదని మాటుందా ఎక్కడయినా ?"

మానసకేమని సమాధానం చెప్పాలో తోచలేదు. సాగర్ ధోరణేమిటో ఆమెకెంతకూ అర్థంగావడంలేదు.

"హలో !"- అంటూ సాగర్ చేయి వూపడంచూసి వెనుదిరిగి చూసింది ఆమె.

రాజేష్ మెట్లెక్కి వస్తున్నాడు.

"అదిగో, రాజేష్ వస్తున్నాడు. యివ్వాళ క్లబ్బుకొద్దని, నేనే ఇక్కడికి ప్రోగ్రాం ఫిక్స్‌చేశాను. నువ్విలా ఏడుపుముఖం పెట్టుకుని కనిపిస్తే అతనే మనుకుంటాడు చెప్పు ? కొన్నికొన్ని విషయాల్ని తొందరగా మరచిపోవాలి. ఏదయినా పెద్ద సమస్య యెదురయినప్పుడు రాజేష్ ఏమనేవాడో తెలుసా ? ముందెప్పుడో రాబోయే ఆనందానికి యిది కౌంటర్‌పార్టయివుంటుందని అనేవాడు. అలావుండాలి మనిషంటే..."

మానస నీరసంగా స్థంభానికి చేరగిలబడిపోయింది. ఆమెకు లోకమంతా అలుక్కుపోయినట్టుగా కనిపించసాగింది.

"హలో ! బావున్నారా ?" అంటూ యధాలాపంగా పలకరించి, అంత

# గృహ ప్రవేశం

శ్రీ పి. ఏ. రామకుమార్

ఆ అమావాస్య చీకట్లో
నాకోసం నేను అన్వేషిస్తున్న సమయంలో
నా ఇల్లు నాకు ఎదురయింది
శిథిలమైన కలల శకలాలన్నీ పేర్చి
ఒక జీవితం సేపు శ్రమించి
నేను నిర్మించుకున్న మృత్యుసౌధం అదే నట
నన్ను నిలుచున్నపళంగా బంధిస్తాయి నా ఇంటి గోడలు
నన్ను పాతాళంలోకి తోసేస్తాయి ఆ మేడమెట్లు
నా యింటినుంచి—
కనుచూపుమేరలో అంతమవుతుంది
నా భూగోళం
అమావాస్యనాడు నేనా ఇంట్లో గృహప్రవేశంచేస్తాను

నేను ఇంట్లో అడుగుపెట్టగానే
నా గౌరవార్థం మ్రోగుతాయి కోటి శతఘ్నులు
నా ఇంటి ప్రహరీ గోడపై
వ్రేలాడతాయి అనంతకోటి ప్రాణాల నీడలు
కదిలితే కండలు తెగిపడేలా నాచుట్టూ—

విచ్చుకత్తులు అనుక్షణం నా భద్రత చూస్తుంటాయి
వంటింటి గొట్టంలోనుంచి వచ్చిన పొగ
యుద్ధమేఘాలుగా ఆకాశం అంతా కమ్ముకుంటుంది
నా ఇంటిని నేను
మంచిగంధపు మాలలతో అలంకరిస్తున్న వేళ
ఎక్కడో ప్రపంచం తగులబడుతున్న వాసన

---

లోనే నోరుజారిన విషయం గుర్తుకొచ్చి, నాలుక్కరచుకున్నాడు రాజేష్.

మానస సమాధానం చెప్పలేదు.

సూర్యుడు అస్తమించటంతో, ప్రహరీగోడకవతల పడిన పొదవాటి నీడలు, చీకటిలో మెల్లమెల్లగా కలిసిపోతున్నాయి.

మొక్కుబడికోసమన్నట్టుగా, అయిదారు నిముషాలకోసారి చెట్లు తలలాడిస్తున్నాయి. గర్భగుడిలోంచీ వినిపిస్తున్న గంటల శబ్దాన్ని వెక్కిరిస్తున్నట్టుగా, మెట్లదగ్గర కూచున్న బిక్షగాళ్ళ బొలెలు దణదణలాడుతున్నాయి.

"మీరొచ్చి చాలాసేపయిందా ?" అంటూ అడిగాడు రాజేష్.

"అరగంటయింది" అన్నాడు సాగర్.

"నేనూ అరగంట ముందుగానే వచ్చి వుండేవాణ్ణి. దార్లో మా కొలీగ్ వాకలను అడ్డు తగిలాడు..."

"......"

"యూనివర్శిటీలో ఏదో గొడవ జరిగిందని విన్నాను..."

"మామూలే...గ్రూపిజం... స్టూడెంట్లు స్ట్రయికు చేస్తున్నారు. వీసీ సెలవులు డిక్లేర్ చేసేశారు..."

"మోటార్ బైకును సర్వీసు చేయించాలన్నావు..."

"రేపు యివ్వాలి..."

"......"

"ఫీల్డ్ వర్కుందా రేపు ?"

"డ్యాంసైటు కెళ్ళాలి మళ్ళీ..."

ఆకుకు అందకుండా, పోకకు చెందకుండా నిముషానికో మాట చొప్పున మాట్లాడుకోసాగారు మిత్రులిద్దరూ.

దాదాపు పదిహేను నిముషాలు అలాగే గడచి పోయాయి.

"మీ చెల్లెలి కోసం యెగ్జంప్షన్ కట్టాలన్నావు ?" అన్నాడు రాజేష్

మానస తన ప్రశక్తి రాగానే తలపైకెత్తి చూసింది.

"యెమ్మే ప్రయివేటుగా నయినా చేయాలని అంటూ వుండేదానివి కదా ! యీ సారి అయినా సెప్టెంబరు లోనే రాస్తే సరిపోతుంది. దాని కోసం యెగ్జెంప్షన్ కట్టాలనుకున్నాను..." రాజేష్ వైపుకు తిరిగాడు సాగర్ -

"యీవిడ గారి ధోరణి చూస్తే పరీక్ష రాస్తుందో, లేదోనన్న అనుమానం కలిగింది. అందుకే యింకా పే చేయలేదు..."

"నువ్వు అప్లయి చేసేయి. వీలు కుదిరినప్పుడు పరీక్ష రాయొచ్చు..." అన్నాడు రాజేష్.

"యెప్పటికి వీలుకుదురుతుందని ? యీ పిచ్చి పిల్లకెలా నచ్చచెప్పాలో నాకు తెలియడం లేదు. ఒకసారి లైఫ్‌పార్టనర్ చనిపోతే, యింకోసారి పెళ్ళి చేసుకుంటే సరిపోతుందిగదా అని నేనంటే, మా మనూ యేమందో తెలుసా ? ఆ న్యాయం మొగవాళ్ళకేగానీ, ఆడవాళ్ళకు వర్తించదట !..."

సాగర్ యెకాయెకిని అసలు విషయంలోకి దిగిపోవడంతో, రాజేష్ కూడా యిబ్బంది పడిపోసాగాడు.

"పెళ్ళి గాక మునుపు చిరంజీవంటే ప్రేమేమీ లేదు గదా నీకు ? సంసారం చేసిన ఆరు నెలల్లో నీకు అతణ్ణి మరచిపోలేనంతటి ప్రేమ యెలా పుట్టుకొచ్చేసిందో నాకు అర్థం గావడం లేదు. యింతకూ ప్రేమంటే యేమిటి ? అపోహలతోనూ, భ్రమలతోనూ నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావు. ప్రేమంటే ఒక అగ్రిమెంటు మాత్రమే. సహజీవనం చేయడం కోసమని అతణ్ణి ప్రేమించావు. అతడిప్పుడు లేడు. ఆ అగ్రిమెంటుకు కాలం చెల్లిపోయింది. మళ్ళీ నువ్వు కొత్త అగ్రిమెంటును కుదుర్చుకోవచ్చు. జీవితం అంటే కలగాదు మనూ ! ఆలోచనలు నేలపైన్నే నడవాలి, ఆకాశంలో గాదు. యీ ఆరునెలల జీవితాన్ని నువ్వు మరచిపో. అసలు పెళ్ళే కాలేదని అనుకో ! మళ్ళీ చదువుకో ! యెమ్మే పూర్తి చేయి... మళ్లీ పెళ్ళి చేసుకో ! చేసుకోడానికి సిద్ధపడే వ్యక్తి దొరకదని అనుమాన పడుతున్నావేమో ! లోకం గొడ్డుపోలేదు మనూ ! యెవరి దాకానో ఎందుకు ? నువ్వు నీ ధోరణిని మార్చుకున్న వెంటనే, నిన్ను పెళ్ళి చేసుకోడానికి రాజేష్ సిద్ధంగా వున్నాడు..."

మెరుపొకటి శరీరంలోకి ప్రసరించినట్టుగా వులిక్కిపడిపోయింది మానస. ప్రపంచమంతా స్తంభించిపోయినట్టుగా తోచింది. షాక్‌తో మనస్సు మొద్దుబారిపోయింది. రెప్పలు వేయడం సైతం మరచిపోయి, సాగర్ వైపే చూడసాగింది.

సాగర్ చేయి పట్టుకుని ప్రహరీ గోడ దగ్గరికి లాక్కొచ్చేశాడు రాజేష్. "యేమిటి సాగర్, నువ్వు చేస్తున్న పని ? యేమిటిది ?-" అంటూ కంగారుగా ప్రశ్నించాడు.

"నా ఆర్గ్యుమెంటు రీజనింగా లేదా ?" అన్నాడు సాగర్ బేలగా.

"ఆర్గ్యుమెంటు రీజనింగా వుందా, లేదా అన్నది గాదు యిప్పుడు నేనడిగింది ! మానస యింకా మొదటి షాక్‌నుంచీ బయటపడనేలేదు. కోలుకున్నాక, సమయం సందర్భం కుదిరినప్పుడు, మెల్లమెల్లగా, స్పూన్ ఫీడింగ్ చేయించినట్టుగా చెప్పాలి గానీ యిలా కుండ బద్దలు కొట్టినట్టుగా చెబుతారా యెవరైనా ? ఆమె ఇంకా కుదుట పడలేదు. మామూలు మాటలు వినడానికే బెంబేలు పడిపోతోంది. షాక్ పైన మరో షాక్ తగిలిస్తున్నావేమిటి నువ్వు ?..." రాజేష్ ఆక్రోశించసాగాడు.

(ఇంకా వుంది)